క్లుప్తంగా

కార్తీక ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక అందిస్తున్న ఈవో

దండేపల్లి: జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో ఈ నెల 13నుంచి 15వరకు కార్తీక ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు హాజరవ్వాలని కోరుతూ ఆలయ ఈవో శ్రీనివాస్, సిబ్బంది, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావును సోమవారం మంచిర్యాలలోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. ఉత్సవాలకు హాజరవ్వాలని కోరారు.

11నుంచి జోనల్ స్థాయి క్రీడా పోటీలు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఈ నెల 11వ తేదీ నుంచి జోనల్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమా కళ్యాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పాఠశాలల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని, క్రీడా ప్రాంగణాన్ని, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అధికారులు హాజరుకావాలని కోరారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపిక

నస్పూర్: నస్పూర్‌కు చెందిన బోయిని శ్రీ చైత్ర ఈ నెల 17న పంజాబ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 2 నుంచి 4వరకు సంగారెడ్డిలో నిర్వహించిన స్కూల్ ఫెడరేషన్ అండర్ 14బాలబాలికల కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. పలువురు పట్టణ వాసులు ఆమెను అభినందించారు.

ప్రణాళికతో చదివితే ఫలితాలు


మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

దండేపల్లి: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదివితేనే మంచి ఫలితాలు సాధిస్తారని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి సత్యనారాయణమూర్తి సూచించారు. మండలంలోని వెల్గనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి, వారికి దిశానిర్దేశం చేశారు. సమయాన్ని వృథా చేయకుండా బాగా చదువుకోవాలన్నారు. సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవడం మంచిదన్నారు. పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి స్పందన అంతంతే

భీమారం: మండల కేంద్రంలో కోతుల బెడద పరిష్కరించాలని సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవో మధుసూదన్‌కు యువకులు వినతిపత్రం అందజేశారు. ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని, సమస్య పరిష్కరించాలని కోరారు.
కాసిపేట: ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టా చేయాలని ప్రజావాణిలో ఎంపీడీవో సత్యనారాయణ సింగ్‌కు బాధితుడు దరఖాస్తు సమర్పించాడు. కార్యక్రమంలో తహసీల్దార్ భోజన్న, ఎంపీవో షేక్ సబ్దర్ అలీ తదితరులున్నారు.

నిందితులను శిక్షించాలి


నినాదాలు చేస్తున్న మహిళలు

బెల్లంపల్లి: కోల్‌కత్తాలో అభయపై లైంగిక దాడి చేసి దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ముస్కే జ్యోతి డిమాండ్ చేశారు. బెల్లంపల్లిలో నర్సింగ్ విద్యార్థునులతో కలిసి సోమవారం నిరసన ర్యాలీ చేశారు. నిందితులెవరైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునఃరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు అనిత, జిల్లా నాయకురాలు రాజక్క, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

భీమిని: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ పంచాయతీలో ఇటీవల విద్యుత్ షాక్ గురైన బాధితుడు చిలుముల రాజ్‌కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని సోమవారం గ్రామపంచాయతీలో మాజీ ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరిలక్ష్మణ్ దంపతులు, బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. రాజ్‌కుమార్ కోలుకున్న తర్వాత మండలంలో ఖాళీగా ఉన్న ఏదో ఒక గ్రామ పంచాయతీలో మల్టీ పర్పస్ వర్కర్‌గా ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామని ఎంపీడీవో గంగామోహన్ హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

కళతప్పిన 'వేదిక'

- బెల్లంపల్లిలో కార్మికులు, ప్రజల కోసం ఏర్పాటు
- అతి తక్కువ అద్దెతో వేడుకలు నిర్వహించుకునే సౌలభ్యం
- నిర్వహణ లేక అధ్వానంగా మారిన కళావేదిక
- సౌకర్యాల కల్పనపై దృష్టి సారించని సింగరేణి యాజమాన్యం


సింగరేణి కళావేదిక ముఖద్వారం

బెల్లంపల్లి: సింగరేణి కార్మికులు, ప్రజలకు అత్యంత చౌక ధరకు అద్దెకు ఇవ్వడానికి బెల్లంపల్లి కేంద్రంగా ఏర్పాటు చేసిన సింగరేణి కళావేదిక అధ్వానంగా తయారైంది. ఏళ్ల నుంచి నిర్వహణ లేకపోవడంతో శుభ, అశుభ కార్యక్రమాలు నిర్వహించలేని దుస్థితికి చేరుకుంది. కనీస సౌకర్యాలు లేకపోవడంతో తమ ఇష్టానుసారంగానే కళావేదికను అద్దెకు తీసుకుంటున్నామని లిఖిత పూర్వకంగా రాసి ఇస్తే కానీ సింగరేణి అధికారులు బుక్ చేయని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ తీరే కళావేదిక ప్రస్తుత పరిస్థితులకు అద్దం పడుతుండగా, సుముహూర్తాలు దగ్గర పడుతుండటంతో అప్పటి వరకు మరమ్మతులకు నోచుకుంటుందా లేదా అనే అనుమానాలు కలుగుతున్నాయి.

అతి చౌక ధరకు అద్దె..

పెళ్లిలు, పేరంటాలు, జన్మదిన వేడుకలు, దిన కర్మలు ఇత్యాధి అశుభ, శుభకార్యాల నిర్వహణకు ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఫంక్షన్ హాళ్లలో నిర్వహించుకోవాల్సి వస్తుంది. ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో సౌకర్యాల తీరును బట్టి కనిష్టంగా రూ.30వేల నుంచి గరిష్టంగా రూ.70వేల వరకు అద్దె చెల్లించుకోవాల్సిన పరిస్థితులు ఉంటున్నాయి. అంత మొత్తంలో పేద సామాన్యులు, సాధారణ కార్మికులకు భరించలేని పరిస్థితులు ఉండటంలో సింగరేణి యాజమాన్యం ఆటో గ్యారేజీను ఎత్తివేసి, ఉదారస్వభావంతో సింగరేణి కళావేదికను ఏర్పాటు చేసింది. ఈ కళావేదికలో ఫంక్షన్ నిర్వహించుకునే సింగరేణి కార్మికులు రూ.9వేలు, కార్మికేతరులు రూ. 12వేల చొప్పున అద్దెను చెల్లించాల్సి ఉంటుంది. అయితే కార్మికులు రూ.12 వేలు, కార్మికేతరులు రూ.16వేల చొప్పున డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. వీటిలో కరెంట్ బిల్లును మినహాయించుకొని మిగితా సొమ్మును వాపసు చేస్తారు. ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లతో పోల్చితే కళావేదిక అద్దె అతి చౌక ధర కావడం గమనార్హం.

> **సౌకర్యాలు కల్పించాలి**
>
> మారుతున్న కాలానుగుణంగా సింగరేణి కళావేదికను తీర్చి దిద్దాల్సిన అవసరం ఉంది. ప్రైవేట్ ఫంక్షన్‌హాళ్లతో సమానంగా పైకప్పు, ఇతరత్ర సౌకర్యాలు కల్పించి ఏసీ సదుపాయం కల్పించాలనే డిమాండ్ ఉంది. ఆ తీరుగా ఆధునీకరించడం వల్ల సౌకర్యాలు మెరుగుపడి వినియోగదారులకు ఎంతగానో ఉపయోగపడే అవకాశాలు ఉంటాయి. ఆ దిశగా సింగరేణి అధికారులు చర్యలు తీసుకుని శుభ ముహూర్తాల వరకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

నిర్వహణ లేక..

సింగరేణి కళావేదిక నిర్వహణను సింగరేణి యాజమాన్యం విస్మరించింది. కొంతకాలం నుంచి కళావేదిక దుస్థితిని పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఈ కారణంగా కళావేదిక రంగులు వెలిసిపోయి కళతప్పి కనిపిస్తోంది. సున్నం చెదిరిపోయింది. పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి పరిసరాలు చిత్తడిగా మారాయి. మరుగు దొడ్లు, మూత్రశాలలు పనికిరాకుండా తయారయ్యాయి. ఫంక్షన్ హాల్‌కు దూరంగా మరుగుదొడ్లు ఉండటంతో ఉపయోగపడటం లేదు. కళావేదిక పై కప్పు సిమెంట్ రేకులు పగిలిపోయాయి. పక్కనున్న చెట్ల కొమ్మలు విరిగి మీద పడటంతో రంధ్రాలు ఏర్పడ్డాయి. సరిపడా ఫ్యాన్‌లు లేవు. బోరు లేకపోవడంతో నీటి సమస్య ఏర్పడుతోంది. సింగరేణి పంపు వస్తే కానీ నీటి సదుపాయం లేకుండా ఉంది. వంట శాల, ఆరుబయట పరిసరాలు సరిగ్గా లేక కళావేదికలో ఫంక్షన్‌లు నిర్వహించుకోలేని పరిస్థితులు ఉన్నాయి. కాగా సింగరేణి కళావేదికకు మరమ్మతు చేయించడానికి సింగరేణి అధికారులు ప్రతిపాదనలు చేసినా, ఇంకా కార్యరూపం దాల్చడం లేదు. ఇతర ప్రాంతాల్లో ఈ పాటికే ఫంక్షన్‌హాళ్లకు మరమ్మతు చేయించగా, బెల్లంపల్లి విషయానికి వస్తే కాలయాపన చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.


పగిలిన కళావేదిక పైకప్పు

> **మరమ్మతులకు ప్రతిపాదనలు**
>
> సింగరేణి కళావేదికకు మరమ్మతు చేయించడానికి ప్రతిపాదనలు తయారవుతున్నాయి. సివిల్ విభాగం అధికారులు ఆ పనిలో నిమగ్నమయ్యారు. ఆర్డర్ కూడా తీసుకున్నారు. వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉండేలా ఏసీ సౌకర్యం కూడా కల్పించాలనే యోచనలో యాజమాన్యం ఉంది.
>
> – ఆసిఫ్, సీనియర్ పర్సనల్ అధికారి, మందమర్రి ఏరియా

స్పందించారు.. పరిష్కరించారు



సాక్షి ఎఫెక్ట్..

మందమర్రిరూరల్: వాకర్స్ ఇబ్బంది పడుతున్నారని 'అధ్వానంగా వాకింగ్ ట్రాక్' అనే శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మట్టి కుప్పను బ్లేడ్ ట్రాక్టర్‌తో లెవల్ చేయించారు. ఈ సందర్భంగా వాకింగ్ ట్రాక్ అసోసియేషన్ సభ్యులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని మార్కెట్ వ్యాపారులు డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ కమిషనర్ వెంకటేశ్వర్లుకు సోమవారం వినతిపత్రం అందించారు. మార్కెట్ ఏరియాలో రోడ్లు, డ్రెయినేజీలు సరిగ్గా లేవని, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యాపారులు రమేశ్, సుధాకర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

లెదర్ పార్కు భూమిని కాపాడండి

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని పాలవాగు సమీపంలో లెదర్ పార్కుకు కేటాయించిన భూమిని కాపాడాలని మాదిగ హక్కుల దండోర నాయకులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు.

షాపుల నిర్వహణకు సహకరించాలి


మాట్లాడుతున్న షాపుల యజమానులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి బజారు ఏరియా రాజీవ్ కాంప్లెక్స్‌లో ఉన్న తొమ్మిది షాపుల నిర్వహణకు కోర్టు ఆదేశాలు జారీ చేసిందని షాపుల నిర్వాహకులు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. షాపుల నిర్వాహకులంతా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారమని, తామంటే గిట్టని వారు కొందరు 2022లో తమపై దౌర్జన్యం చేసి షాపులు నడిపించుకోకుండా అనేక ఆటంకాలు కలిగించారని తెలిపారు. గత 60ఏళ్ల నుంచి తాము షాపులను నిర్వహించుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని పేర్కొన్నారు. షాపులను బంద్ చేయించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో న్యాయం కోసం తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు. బెల్లంపల్లి మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి కేసును విచారించి తమకు ఇంజన్ ఆర్డర్ జారీ చేశారని వివరించారు. ఈ విషయాన్ని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను కలిసి వివరించగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. తాముషాపులు నడిపించుకోవడానికి సహకరిస్తానని తెలిపారన్నారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు సహకారం అందించాలని కోరారు. రాజీవ్‌కాంప్లెక్స్ పేరు పెట్టకముందు నుంచే తాము టేలాలు ఏర్పాటు చేసుకొని నడుపుకుంటున్నట్లు గుర్తు చేశారు. తమ షాపులకు, కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కోర్టు ఆదేశాల ప్రకారంగా నడుచుకుంటామని వెల్లడించారు. సమావేశంలో షాపుల యాజమానులు ఏనుగు పెంటయ్య, విష్ణుబత్తుల రాజయ్య,కిషన్,సమ్మయ్య, ఎస్.శ్రీనివాస్,పసుపులేటి రాజేష్, ఎండి పాషా విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల రక్షణ కోసమే 'కమ్యూనిటీ కాంటాక్ట్'


మాట్లాడుతున్న సీఐ అఫ్జలొద్దీన్

బెల్లంపల్లిరూరల్: ప్రజలకు మెరుగైన రక్షణ కల్పించడం కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్ అన్నారు. బెల్లంపల్లి మండలం దుగ్నెపల్లి గ్రామంలో సోమవారం తాళ్లగురిజాల ఎస్సై చుంచు రమేశ్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ చేపట్టారు. డాగ్ స్క్వాడ్‌తో ఇంటింటిని, కిరాణా షాపుల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో గంజాయి క్రయవిక్రయాలు చేపట్టినా, గంజాయి సేవించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాలడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత చెడు వ్యవసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకొని వాటి సాధన దిశగా అడుగులు వేయాలని సూచించారు. సరైన వాహన ధ్రువీకరణ పత్రాలు లేని 25ద్విచక్ర వాహనాలు, 1 ఆటో, రెండు లీటర్ల గుడుంబాను సీజ్ చేశారు. ఏమైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు. సైబర్ నేరాలు, లైంగిక వేదింపులు, ఆత్మహత్యలు, షీ టీమ్ విధులు, డయల్ 100 పై అవగాహన కల్పించారు. గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి టూటౌన్ ఎస్సై మహేందర్, ఏఆర్ ఆర్‌ఎస్సై ప్రవీణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బిడ్డకు సన్మానం


సంతోష్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

జన్నారం: ఏడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన రైతు బిడ్డ నస్పూరి సంతోష్, అతడి తండ్రి లచ్చన్నను స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గ్రామ విద్యార్థులు, యువకులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లిరూరల్: ఐకేపీ వీవోఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట మండల వీవోఏలు ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మహేందర్, ఐకేపీ ఏపీఎం శ్యామలకు వినతిపత్రాలు అందజేశారు. సమస్యలు పరి ష్కరించని ఎడల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 11, 12తేదీల్లో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు పరామర్శ

పాతమంచిర్యాల: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థినులకు ఫుడ్ పాయిజన్ కాగా మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విద్యార్థినులను సోమవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ పరామర్శించారు.

షీ టీం పై అవగాహన

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మిమ్స్ డిగ్రీ కళాశాలలో సోమవారం షీ టీం ఎస్సై వి.హైమా షీ టీమ్స్‌పై అవగాహన కల్పించారు. మహిళల భద్రత, రక్షణ కోసం పోలీస్‌శాఖ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుందన్నారు. అమ్మాయిలను ఎవరైన వేదింపులకు గురిచేస్తే ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ చేసినట్లైతే రామగుండం షీటీం నంబర్ 6303923700 లేదా 100కు ఫోన్ ద్వారా సమాచారం అందించాలన్నారు. షీ టీమ్ సిబ్బంది సతీశ్, జ్యోతి, ప్రిన్సిపాల్ ఉపేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'సమాజ సేవలో ముందుండాలి'

లక్సెట్టిపేట: ఆర్యవైశ్య నాయకులు సమాజ సేవలో ముందుండాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్రాధ్యక్షుడు అమరాది అన్నారు. మండల కేంద్రంలోని వైశ్య భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య మహాసభ జిల్లాధ్యక్షుడు కొత్వ వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో ముందుండాలని, ప్రతి ఒక్కరికి సాయం చేసేందుకు ముందుకు రావాలని సూచించారు.

కొనసాగుతున్న ఇంటింటా సర్వే

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటింటి, సమగ్ర కులగణన సర్వే సోమవారం హాజీపూర్ మండలంలో కొనసాగింది. సర్వేకు సంబంధించి ఆరుగురు సూపర్‌వైజర్లు పర్యవేక్షణ చేపడుతున్నారు. గుడిపేటలో జరుగుతున్న సర్వేను మండల సర్వే అదనపు ఇన్‌చార్జి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావుదేశ్‌పాండే పర్యవేక్షించి సర్వే పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

కరపత్రాల ఆవిష్కరణ

జన్నారం: డిసెంబర్ 14, 15తేదీల్లో నిర్వహించే యూఎస్‌ఎఫ్‌ఐ జాతీయ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆవిష్కరించారు. యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మిట్టపెల్లి తిరుపతి మాట్లాడుతూ.. విజయవాడలో జరిగే ఈ సభల్లో జిల్లా వ్యాప్తంగా ఐక్య విద్యార్థి ఫెడరేషన్ సభ్యులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

పైప్‌లైన్ తొలగించాలని ఫిర్యాదు

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన లక్ష్మీనారాయణగౌడ్, తన ఇంటి సెప్టిక్ ట్యాంక్ నీటిని పైప్‌లైన్ ద్వారా డ్రెయినేజీలో వేయడంపై స్థానికులు అభ్యంతరం తెలిపారు. దీనిపై ఎంపీడీవో ప్రసాద్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు.

వినతిపత్రం అందజేత

జైపూర్: తమకు రావాల్సిన స్త్రీనిధి ఇన్సెంటివ్‌లు చెల్లించాలని వీవోఏలు ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థికి చేయూత

జైపూర్: మండలంలోని ముదిగుంట గ్రామానికి చెందిన పత్తి సాయి రాహుల్ ఇటీవల ఎంబీబీఎస్ సీటు సాధించగా, నిరుపేద కుటుంబానికి చెందిన ఆయనకు ఆత్మీయ ట్రస్ట్ తరుపున రూ.15వేల ఆర్థిక సాయం అందించారు.

ఆర్థిక సాయం

శ్రీరాంపూర్: కృష్ణా కాలనీలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ పెనుగొండ సంపత్ కుటుంబానికి తోటి ఆటో డ్రైవర్లు రూ.30వేల నగదు, నిత్యావసర సరుకులు సోమవారం అందజేశారు.

సభ్యత్వ నమోదు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని టీఎన్‌టీయూసీ కార్యాలయంలో సోమవారం టీడీపీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆ పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ కన్వీనర్ సంజయ్‌కుమార్ హాజరై పలువురికి సభ్యత్వం అందించారు.

■ బొగ్గుబాయి వార్తలు

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న గని మేనేజర్ వెంకట్‌రావు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్‌ఆర్పీ 3, 3ఏ గనిలో గైర్హాజరు కార్మికులకు గని మేనేజర్ వెంకట్‌రావు కౌన్సెలింగ్ నిర్వహించారు. కారణాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గని రక్షణ అధికారి మహేందర్, సంక్షేమ అధికారి గౌస్ పాషా, ఫిట్ కార్యదర్శి మురళి చౌదరి పాల్గొన్నారు. గనిలో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రామోజీకి అధికారులు బహుమతి ప్రదానం చేశారు. మున్ముందు కూడా రాణించాలని ఆకాంక్షించారు.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

శ్రీరాంపూర్: సెక్యూరిటీ సిబ్బంది విధులకు హాజరయ్యేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని శ్రీరాంపూర్ ఏరియా సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి తెలిపారు. ఆ డిపార్టుమెంట్ కార్యాలయం వద్ద సోమవారం సెక్యూరిటీ గార్డులను ఉద్దేశించి మాట్లాడారు. రోడ్డు భద్రత పాటించాలన్నారు. హెల్మెట్‌తో వస్తేనే డ్యూటీలకు అనుమతిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్లు పోగుల స్వామి, రామ్ రెడ్డి, జూనియర్ ఇన్‌స్పెక్టర్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిట్ సెక్రెటరీ పదవిపై వివాదం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా ఎస్సార్పీ 3, 3ఏ గని ఐఎన్టీయూసీ ఫిట్ సెక్రెటరీ నియామకంపై వివాదం ఏర్పడింది. యూనియన్‌కు చెందిన బ్రాంచీ నేత వీరమల్లు సోమవారం గనిపై కార్మికుల సమక్షంలో ఈ వివాదాన్ని లేవనెత్తారు. ఫిట్ సెక్రెటరీగా తనకు అర్హత ఉన్నా, తనను కాదని మరో వ్యక్తికి పదవి ఇవ్వడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇంతటితో ఆగకుండా ఆ యూనియన్ బ్రాంచీ నాయకునిపై తీవ్ర స్థాయిలో దుర్భాషలాడారు. వీరమల్లు దుర్భాషలాడటం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఫిట్ సెక్రెటరీ పదవి చర్చనీయాంశంగా మారింది.

నూతన జీఎంకు ఏఐటీయూసీ సన్మానం


జీఎంను సన్మానిస్తున్న సీతారామయ్య, తదితరులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ నూతన జీఎంగా బాధ్యతలు చేపట్టిన ఎల్వీ సూర్యనారాయణను గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. జీఎం కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో సోమవారం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య జీఎంను శాలువాతో సత్కరించారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచీ కార్యదర్శి బాజీ సైదా తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ సందర్శన

శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిని నూతన జీఎం సూర్య నారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా గని అధికారులు ఆయన్ను మర్యాదపూర్వకంగా సన్మానం చేశారు. మైసమ్మ ఆలయంలో జీఎం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్, గని మేనేజర్ బ్రహ్మాజీ, సంక్షేమ అధికారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పదోన్నతి పత్రాలు అందజేత


పదోన్నతి పత్రాలు పొందిన వారితో మేనేజర్

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 2 గనిలో సోమవారం బదిలీ వర్కర్ల నుంచి జనరల్ మజ్దూర్‌లుగా పదోన్నతి పొందిన 92మంది కార్మికులకు గని మేనేజర్ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా పదోన్నతి పత్రాలు అందజేశారు. గనిలో పని ప్రదేశంలో రక్షణ పద్ధతిలో ఉత్పత్తి సాధించడంలో కార్మికులు అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్యూటీకి వచ్చే సమయంలో హెల్మెట్ ధరించాలని, కార్మికులు గైర్హాజరు శాతం తగ్గించి సంస్థ ఉత్పత్తికి పాటు పడాలన్నారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్, రక్షణాధికారి రవి శంకర్, అధికారులు, సూపర్‌వైజర్లు, కార్మికులు పాల్గొన్నారు.

'చందాలతోనే యూనియన్ కార్యకలాపాలు'

శ్రీరాంపూర్: కార్మికులు ఇచ్చిన చందా డబ్బులను యూనియన్ కార్యకలాపాలు, నిర్వహణకు వినియోగిస్తున్నట్లు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదా, ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్ రావు, సహాయ కార్యదర్శి కొమురయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులు ఆథరైజేషన్ ఇచ్చిన మేరకే వారి వేతనాల నుంచి సభ్యత్వం డబ్బులు వసూలు చేసినట్లు తెలిపారు. చందాలు ఇచ్చిన కార్మికులకు యూనియన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల యూనియన్ పేరుతో కాకుండా, గుడి కమిటీ పేరుతో ఈ చందా డబ్బులు రికవరీ జరిగిందని, దీనికి ఎలాంటి దురుద్దేశం లేదని తెలిపారు. కొన్ని కార్మిక సంఘాలు కావాలని తమను బదనాం చేసే పని చేస్తున్నాయని ఆరోపించారు.

ఘనంగా విటీ అబ్రహం వర్ధంతి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని ఏఐటీయూసీ ఆఫీస్, గనులు,డిపార్టుమెంట్‌లపై కార్మిక నాయకులు కామ్రెడ్ విటీ అబ్రహం వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. అబ్రహం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ఏరియా బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ సుదర్శన్, నాయకులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌తో పరిరక్షణ సంఘానికి సంబంధం లేదు'


మాట్లాడుతున్న నాయకులు

బెల్లంపల్లి: బీఆర్‌ఎస్‌తో తమకెలాంటి సంబంధం లేదని, తామంటే గిట్టనివారు కొందరు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని దళిత కులాల పరిరక్షణ సంఘం బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు చిలుక రాజనర్సు, వర్కింగ్ ప్రెసిడెంట్ కాసర్ల యాదగిరి, ప్రధాన కార్యదర్శి గోమాసరాజం తెలిపారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబుపై కొందరు దళిత సంఘాల నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో సంఘం నాయకులు మనోహర్, రమేష్, బానయ్య, మురళి, రాజలింగు తదితరులు పాల్గొన్నారు.